క్లుప్తంగా

ఐటీఐలో ఐదో దఫా స్పాట్ అడ్మిషన్లు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో నాలుగో దఫాలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 25 నుంచి 28వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. ఐటీఐలో సీటు పొందాలనుకునే అభ్యర్థులు ఆయా ఐటీఐలో నిర్ణీత సమయంలో మధ్యాహ్నం 11గంటల లోపు ఐటీఐ రిజిస్ట్రేషన్ ఫారం సంబంధిత సర్టిఫికెట్లతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో హాజరుకావాలన్నారు. ఐదో దఫా వాక్-ఇన్ అడ్మిషన్ కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థులు, ఇంతకు ముందు అప్లై చేసుకోని అభ్యర్థులు కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు మళ్లీ నమోదు అవసరం లేదన్నారు. మూడు దఫాల్లో సీటు పొందిన అభ్యర్థులకు ఈ అవకాశం వర్తించదని పేర్కొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసి సన్మానం



పీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న మోహన్‌రెడ్డి

జన్నారం: నూతనంగా తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన మహేశ్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, జన్నారం మండల వాసి గుర్రం మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పటిష్టం గురించి చర్చించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, నాయకుల్లో, కార్యకర్తల్లో ఉత్తేజం నింపేందుకు ఒకసారి మండలంలో పర్యటించాలని కోరినట్లు, ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు మోహన్‌రెడ్డి తెలిపారు.

చీరలు పంపిణీ



చీరల పంపిణీలో తిరుపతి, నాయకులు

దండేపల్లి: మాటతప్పని నాయకుడు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అని రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. మంచిర్యాల నియోజకవర్గ ఆడపడుచులకు ప్రేంసాగర్‌రావు అధికారంలో లేకున్నా, ఉన్నా.. ఏటా బతుకమ్మ పండక్కి ఆడపడుచులకు ఇచ్చిన మాట ప్రకారం, కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. దండేపల్లి మండలంలోని తాళ్లపేట, రాజుగూడ, నాగసముద్రం, మాకులపేట, లింగాపూర్ గ్రామాల్లో మంగళవారం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు.

'భూకబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న అధికారులు'

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో భూకబ్జా దారులకు కొందరు అధికారులు వత్తాసు పలుకుతున్నారని మున్సిపల్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు పొట్ల సురేష్, ముస్లిం మైనార్టీ నాయకుడు అమానుల్లాఖాన్ తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భూ కబ్జా దారులు దినదినం పెట్రేగి పోతున్నారన్నారు. భూముల కబ్జాకు పాల్పడుతుండటంతో పాటు అమాయకులను బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ జోక్యం కలిపించుకొని భూకబ్జాలు, రౌడీ మూకలను నివారించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు దేవసాని ఆనందర్, ముస్లిం మైనార్టీ నాయకుడు అన్వర్ ఖాన్, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

• ముగ్గురిపై కేసు నమోదు

నెన్నెల: అక్రమంగా పశువులను తరలిస్తున్న ఓ వాహనాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మైలారం నుంచి ముత్తాపూర్‌కు పశువులు తరలిస్తున్నట్లు తమకు అందిన పక్కా సమాచారం మేరకు జోగాపూర్ టీ రోడ్డు వద్ద మాటు వేసి టీఎస్ 03యూసీ4551 వాహనాన్ని పట్టుకున్నామని పేర్కొన్నారు. వాహనంలో నాలుగు ఆవులు, నాలుగు ఎడ్లను ఇరుకిరుకుగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వరంగల్ జిల్లాకు చెందిన డ్రైవర్ గట్టికొప్పుల నాగరాజు, క్లీనర్ మహ్మద్ ఇస్మాయిల్, కన్నెపల్లి మండలం ముత్తాపూర్‌కు చెందిన మహ్మద్ రియాసత్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. పశువులను గోశాలకు తరలించామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా

• బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



లబ్ధిదారులతో ఎమ్మెల్యే వినోద్, నాయకులు

బెల్లంపల్లి/తాండూర్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఎజెండా అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి అన్నారు. బెల్లంపల్లి, తాండూర్ మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కల్యాణ లక్ష్మి, బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్రంలోని ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీలను అమలు చేసినట్లు, మిగితా హామీలను కూడా అమలు చేసేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. బెల్లంపల్లిలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగాలు, డయాలసిస్ సెంటర్, ఫార్మా విభాగాల పనితీరును ప్రత్యక్ష్యంగా పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాండూర్ ప్రజాపరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎమ్మెల్యేగా తనకు అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు సేవ చేసే లక్ష్యంతోనే పని చేస్తున్నానన్నారు. రూ.2.40కోట్లతో బోయపల్లి నుంచి బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయం వరకు బీటీ రోడ్ నిర్మాణం, రూ.1.60కోట్ల నిధులతో కత్తెరకు బీటీ రోడ్ నిర్మాణం తో పాటు, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.80లక్షలు, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.కోటి, హెచ్‌డీఎఫ్ నిధులు రూ.85లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. బెల్లంపల్లి వరకు మంజూరైన ఎల్లంపల్లి నీళ్లను తాండూర్‌కు తీసుకొచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు వినతిపత్రాలు అందించగా, సానుకూలంగా స్పందించారు. ఆయా కార్యక్రమాల్లో తాండూర్‌లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, బెల్లంపల్లిలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, ఇతర వైద్యులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, పలువురు మున్సిపల్ కౌన్సెలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కొత్తగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను బుధవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే గడ్డం వినోద్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరై మార్కెట్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థికి సన్మానం



రహ్మాన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వినోద్

నెన్నెల: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన నెన్నెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి సయ్యద్ రహ్మాన్‌ను మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ సన్మానించారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

తప్పుడు ఆరోపణలు చేసి కేసులు పెడితే భయపడం

• మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనపై, తన కుమారుడిపై తప్పుడు ఆరోపణలు చేసి, కేసులు పెట్టాలని చూస్తున్నారని, ఎలాంటి కేసులకు తాము భయపడబోమని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో తన కుమారుడు నడిపెల్లి విజిత్‌రావు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన తన గురించి మంచిర్యాల నియోజకవర్గం ప్రజలకు తెలుసునని, తమపైన ఎన్ని ఆరోపణలు చేసినా, ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తప్పుడు ప్రచారం చేయడం, తప్పుడు కేసులు పెట్టాలని చూడడం తప్పా, మంచిర్యాలలో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే ముందుకు రావడం లేదని ఆరోపించారు. మంచిర్యాల అభివృద్ధి పేరుతో మార్కెట్లో కూల్చివేతలను కేవలం కొందరు వ్యాపారుల కోసం మాత్రమే చేస్తున్నారని, ఎనిమిది నెలల్లోనే మంచిర్యాలను మాఫియా మంచిర్యాల చేసిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. అనంతరం నడిపెల్లి విజిత్‌రావు మాట్లాడుతూ.. 324సర్వే నంబరులో గజం స్థలం కూడా మాకు లేదని, ప్రస్తుతం ప్రభుత్వం మీదే ఉందని, ఎమ్మెల్యేగా ఉన్న మీ మాటల్లో నిజం ఉంటే 57ఎకరాల భూమిని తీసి ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేశ్, మొగిలి శ్రీనివాస్, మందపల్లి శ్రీనివాస్, తోట తిరుపతి, నరేశ్, శ్రీపతి వాసు, సాగి వెంకటేశ్వర్‌రావు, సుంకిర రమేశ్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

'టేలాలు తొలగించి ఉపాధికి దూరం చేయొద్దు'



మాట్లాడుతున్న చిరువ్యాపారులు

భీమారం: మండల కేంద్రంలోని ఊరచెరువు వద్ద కొన్నేళ్లుగా టేలాలు ఏర్పాటు చేసుకొని చిరువ్యాపారాల ద్వారా ఉపాధి పొందుతున్నామని, వీటిని తొలగించొద్దని చిరువ్యాపారులు మంగళవారం పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం టేలాలను తొలిగించాలని రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసిందని వారు తెలిపారు. దాదాపు 30కుటుంబాలు చిరువ్యాపారం చేసుకుంటూ, కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోయారు. చెరువులో ఎలాంటి శాశ్వత కట్టడాలు చేపట్టకుండా, కేవలం టేలాలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. అధికారులు పునరాలోచించి టేలాలను ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బెదిరింపు రాజకీయాలు మానుకోవాలి

• బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు బెదిరింపు రాజకీయాలను మానుకోవాలని, లేనిపక్షంలో డీజీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని వారి పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ నాయకులపై చేసిన ఆరోపణలు ఖండిస్తున్నామని, కాంగ్రెస్ నాయకులు భూ ఆక్రమణలు, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు విఫలం అవడంపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కేవలం ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, దీనిపై సీఎం, పోలీసుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న భూకబ్జాదారులే, భూ ఆక్రమణలపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, హైదరాబాద్‌లోని కాప్రాలో పేదల భూములు కబ్జా చేసిన చరిత్ర ఎమ్మెల్యేదేనని ఆరోపించారు. కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, మోటపలుకుల తిరుపతి, గాదె సత్యం, కర్రె లచ్చన్న, పూదరి రాంచందర్, ముదాం మల్లేశ్, అమిరిశెట్టి రాజు, బొలిశెట్టి అశ్విన్, గాజుల ప్రభాకర్, కంకణాల సతీశ్, కాశెట్టి నాగేశ్వర్‌రావు, ఈర్ల సదానందం, మధు రెన్వా పాల్గొన్నారు.

భీమారం: పార్టీ సభ్యత్వ నమోదుపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. రఘునాథ్ మాట్లాడుతూ.. గతంలో పట్టణాలకే పరిమితంగా ఉండే బీజేపీ, ప్రధాని మోడీ చేస్తున్న అభివృద్ధితో గ్రామాల్లో కూడా ప్రజలు బీజేపీపై ప్రేమ చూపిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా సాగుతున్న సభ్యత్వ నమోదు కోసం యువకులు, మహిళలు అధిక సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారన్నారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొర్లకుంటు శంకర్, ప్రధాన కార్యదర్శి మాడెం శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం వర్తింపజేయాలి



మాట్లాడుతున్న అఖిల

బెల్లంపల్లి: మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు వర్తింపజేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షురాలు కామెర అఖిల డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి ఉద్యమాల్లో పీడీఎస్‌యూకు ఎంతో చరిత్ర ఉందన్నారు. విద్యార్థి సమస్యలపై రాజీ లేని పోరాటాలు సాగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మాదిరిగానే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ శ్రేణులు మౌనిక, ప్రమోద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యసేవలు వినియోగించుకోవాలి

• కలెక్టర్ కుమార్ దీపక్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

కాసిపేట: ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, వార్డులు, ల్యాబ్, ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది రోగుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం సోనాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. వంటశాల, హాజరుపట్టిక, సామగ్రి నిల్వలు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా పాఠం బోధించారు. నాయకపుగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గట్రావ్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వార్డుల్లో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణసింగ్, డీఎల్‌పీవో షేక్ సబ్దర్‌అలీ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పాఠశాలలకు అదనపు తరగతి గదులు..

బెల్లంపల్లి/భీమిని: శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలకు అదనపు తరగతి గదులు మంజూరు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రాంనగర్ బస్తీలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల, భీమిని మండలం చర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాలను సందర్శించారు. రాంనగర్, చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరడంతో అదనపు తరగతి గదులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో మహేందర్‌రావు, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ఏఈ వినయ్ తదితరులు ఉన్నారు.

తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ పరికరాలు

• ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్

మంచిర్యాలఅగ్రికల్చర్: నాణ్యమైన విద్యుత్ పరికరాలు తక్కువ ధరలో టీజీఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో విక్రయిస్తున్నట్లు జిల్లా విద్యుత్ అధికారి ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈసీఎల్) హోం పేజీ ద్వారా ఎంపిక చేసుకున్న పరికరాలు కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ వినియోగం తగ్గించడంతోపాటు నాణ్యమైన ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఇండక్షన్‌స్టవ్, 5 స్టార్ బీఎల్‌డీసీ ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియంట్ ఎయిర్ కండిషన్లు(ఏసీ)లు, ఎల్‌ఈడి ఇన్వర్టర్ బల్బులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పరికరాలు ఆర్డర్‌పై ఇంటికే వస్తాయని తెలిపారు. ఈఈఎస్‌ఎల్ పేజీలో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా కూడా కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

• జీఎం సంజీవరెడ్డి



మైదానంలో శుభ్రం చేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో స్వచ్ఛత 4.0 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీసీలోని సింగరేణి మైదానంలో జీఎం సంజీవరెడ్డి, ఇతర అధికారులు చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ప్రతీ ఉద్యోగి తన ఇంటి చుట్టూనే కాకుండా, తను పనిచేసే గనులు, డిపార్టుమెంట్‌ల వద్ద కూడా పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ కొమురయ్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, సివిల్ డీజీఎం ఆనంద్ కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, సివిల్ ఇంజనీర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

'లాభాల వాటా ఘనత ఏఐటీయూసీదే'

తాండూర్: సింగరేణిలో లాభాల వాటా హక్కును కల్పించింది ఏఐటీయూసీ యూనియన్ ది అని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి వర్క్‌షాప్‌లో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కార్మికులకు 33శాతం లాభాల వాటా ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కిరణ్, రాజేశం, అశోక్, వసీం, వీరరఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ లాభాలపై వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణి గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాల నుంచే కార్మికులకు వాటా చెల్లించాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, నాయకులు ఈశ్వరాచారీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ వాస్తవ లాభం రూ.4701 కోట్లుగా ప్రకటించి, మళ్లీ అందులో నుంచి కోత పెట్టి మిగిలిన రూ.2412 కోట్ల నుంచే 33శాతం వాటా చెల్లించడం సరికాదన్నారు. ఈ లెక్కన వాస్తవ లాభాల నుంచి కార్మికులకు దక్కింది కేవలం 16.93శాతమే అన్నారు. ఇకనైనా వాస్తవ లాభాలపై వాటాను చెల్లించాలని డిమాండ్ చేశారు.

'కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోం'

మందమర్రిరూరల్: గత ఆర్థిక సంవత్సరం సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాల్లో 33శాతం వాటా కార్మికులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. లాభాల వాటా పంపిణీ విషయంలో కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని, సింగరేణిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, నాయకులు ఉన్నారు.

టీబీజీకేఎస్ నాయకుల నిరసన

శ్రీరాంపూర్: కంపెనీ లాభాల ప్రకటనలో అంకెల గారెడి చేశారని టీబీజీకేఎస్ నాయకులు ఆరోపించారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నస్పూర్ కాలనీ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

టింబర్ యార్డ్ కార్మికులకు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న సారయ్య

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని టింబర్ యార్డ్ కార్మికులకు వేతనాలు పెంచాలని హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. టింబర్ యార్డ్‌ను మంగళవారం ఆయన సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రమకు తగ్గ వేతనాలు అందడం లేదని, సింగరేణిలో ఇతర విభాగాలు గనుల్లో పనిచేసే కార్మికులతో పోలిస్తే వీరికి వేతనాల పెరుగుదల ఉండటం లేదన్నారు. కంపెనీ పాలసీల్లో ఉన్న లోపాలను సరిచేసి వేతనాలు పెంచేలా హెచ్‌ఎంఎస్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి అనిల్ రెడ్డి, నాయకులు పల్లె క్రాంతి కుమార్, శ్రీనివాస్ రాధాకృష్ణ, ప్రతాప్ పాల్గొన్నారు.

'ఎప్పటిలాగానే లాభాల వాటా'

శ్రీరాంపూర్: ఎప్పటిలాగానే ఈ సారి కూడా కంపెనీ నికర లాభాలను ప్రకటించి అందులో నుంచి వాటా చెల్లించినట్లు ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మంగళవారం ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. వాస్తవ లాభాల నుంచి కాకుండా పెట్టుబడులను తీసేసి, మిగిలిన లాభాల నుంచి 33శాతం వాటా ఇవ్వడం సరికాదని టీబీజీకేఎస్, ఇతర సంఘాల నాయకులు ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీబీజీకేఎస్ హయాంలో ఎలా లాభాలు ఇచ్చారో, ఇప్పుడు కూడా అదే విధంగా లెక్కించి ఇచ్చారన్నారు.

సంక్షిప్త వార్తలు

'ఓపెన్' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 3నుంచి 9వరకు నిర్వహించే ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్షలుంటాయన్నారు. ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ సబ్జెక్టుల వారికి అక్టోబర్ 16నుంచి 25వరకు ప్రాక్టికల్ పరీక్షలుంటాయన్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల గర్మిళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

అంబులెన్స్ తనిఖీ

జన్నారం: మండల కేంద్రలోని 108అంబు లెన్స్‌ను మంగళవారం స్పెషల్ ఆడిటర్ పకీర్‌దాస్ తనిఖీ చేశారు. మెడికల్ యంత్రాల పనితీరు, సామగ్రి వివరాలను, మందులు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. వాహనం కండీషన్‌ను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు తెలిపారు.

అవగాహన కల్పించాలి

మంచిర్యాలటౌన్: పొగాకు వాడకుండా దూరంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఈ కార్యక్రమాన్ని 60రోజుల పాటు అన్ని ప్రభుత్వ దవాఖానాల్లో చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్ రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక, పట్టణ ప్రాథమిక, సీహెచ్‌సీలల్లో వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పలు పాఠశాలలతో పాటు గురుకుల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాలను తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే ఆకస్మిక తనిఖీలు చేశారు. ముల్కల్లలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుడిపేటలోని మహాత్మ జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన సమయంలో తహసీల్దార్ ఆకస్మిక తనిఖీలు జరిపి భోజన నాణ్యతను పరిశీలించారు.

ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకోవాలి

నస్పూర్: నేటి సమాజంలో పాఠశాల స్థాయిలో తప్పనిసరిగా తెలుగును అభ్యసించడం ముఖ్యమైనదని తెలుగు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దామోదర్‌రావు అన్నారు. విలేజ్ నస్పూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జైపూర్, భీమారం, నస్పూర్, మంచిర్యాల, హాజీపూర్ మండలాల తెలుగు భాషా ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి 44మంది ఉపాధ్యాయులు హాజరు కాగా కాంప్లెక్ హెచ్‌ఎం దామోదర్‌రావు మాట్లాడుతూ తెలుగులో విద్యార్థులకు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళిక బద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

చెన్నూర్: నియోజవకర్గంలో జాతీయ రహదారి అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరు చేయడంపై బీజేపీ పట్టణ అధ్యక్షులు జాడి తిరుపతి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

క్రీడల్లోనూ రాణించాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నూ రాణించాలని డీటీడీవో గంగారాం అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల ఆవరణలో మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల డివిజన్ స్థాయి పోటీలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చి న విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని తెలి పారు. క్రీడలతో శారీరక, మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. రెండు రోజులు డివిజన్‌స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ప్రతి భ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 27న ఆసిఫా బాద్‌లో నిర్వహించే జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో పురుషో త్తం, ఏసీఎంవో రాజమౌళి, పాఠశాల ప్రిన్సిపాల్ రో నాల్డ్ కిరణ్, సత్యనారాయణ, డీఎస్‌వో జీవరత్నం, పీఈటీలు పాల్గొన్నారు.